క్లుప్తంగా

దశకంఠుని వాహనం వితరణ


రావణాసుర వాహనాన్ని అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాద్‌కు చెందిన జ్యోతి, శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన ధర్మయ్య కలిసి రావణాసుర వాహనాన్ని వితరణ చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీనిని అందజేశారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ గదుల వేలం

పిచ్చాటూరు: మండలకేంద్రంలో పిచ్చాటూరు పంచాయతీకి చెందిన శ్రీ గంగాధరం రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని 23 గదులకు వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సర్పంచ్ విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందస్తు ధరావత్తు రుసుం చెల్లించి సాల్వేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలోని గ్రీన్ అంబాసిడర్లు కేంద్రప్రభుత్వం రెండేళ్లుగా జీతాలు ఇవ్వడం లేదని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 680 విడుదల చేసి 10 నెలలు గడిచినా ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. కరోనాలో ప్రాణాలను లెక్క చేయకుండా పారిశుద్ధ్య పనులను చేశామని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేల జీతం ఇవ్వాలని, పెండింగ్ జీతాలతో పాటు మాస్కులు, గ్లౌజులు, శానిటైజర్లు, యూనిఫాం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ త్రివిక్రమ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిన్నిరాజ్, గంగయ్య, రాజా పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యసాధన


మాట్లాడుతున్న సీఐ దివాకర్ రెడ్డి

సత్యవేడు: విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని పట్టుదలతో సాధించాలని సీఐ దివాకర్ రెడ్డి అన్నారు. సోమవారం బాబు జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి గట్టి సంకల్పం, దానికి తగిన కృషితో ముందుకెళ్లాలన్నారు. కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులకు విజయగాథలను ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓలు కే. రవి, ఉష వివరించారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పరంధాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు పురస్కారాలు


ప్రముఖులను సన్మానిస్తున్న నవసమాజ ఫెడరేషన్ అధ్యక్షుడు నగేష్, అతిథులు

తిరుపతి సిటీ : నవ సమాజ ఫెడరేషన్ 13వ వార్షికోత్సవాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ ఆధ్వర్యంలో ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, సామాజిక సేవలో విశేష కృషి చేసిన సుమారు 13 మంది ప్రముఖులను సన్మానించారు. జ్యోతి ప్రకాష్, విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నిరంజన్‌బాబు, బీవీ మురళీధర్, పి రెడ్డెప్ప, జనార్దన్, ఎస్ ఖాజా, ఒ కిరణ్‌కుమార్, రామాంజనేయులు, కే సీమ తదితరులు ఉన్నారు. చదలవాడ సుచరిత, ఎస్వీడబ్ల్యూ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, పీసీ రాయల్, మాజీ రిజిస్ట్రార్ మమత పాల్గొన్నారు.

డీకేటీ హాంఫట్!

- అక్రమంగా వెంచర్ వేసి టీడీపీ నేత 'రియల్' వ్యాపారం
- రూ.5కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోరా?
- మండల సమావేశంలో మండిపాటు
- అధికారులను నిలదీసిన వైస్ ఎంపీపీ శ్రీనివాసులు


టీడీపీ నేత వెంచర్ వేసిన డీకేటీ భూమి ఇదే (ఫైల్)

ఏర్పేడు: రూ.5కోట్ల పైచిలుకు విలువైన డీకేటీ భూమిలో దర్జాగా అక్రమ వెంచర్ వేసి, ప్లాట్లుగా ఓ టీడీపీ నాయకులు విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారని వైస్ ఎంపీపీ జమ్మల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గీత అధ్యక్షతన నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ, ఆమందూరు బీసీ కాలనీలో సర్వే నంబర్ 96–3లో 1.38 ఎకరాల డీకేటీ భూముల్లో ఆమందూరు సర్పంచ్ బాలగురునాథం నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ వేసి విక్రయిస్తునాడని ఆరోపించారు. దీనిపై కొంత కాలం క్రితం పత్రికల్లో వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. ఇకనైనా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజును డిమాండ్ చేశారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీలో జాబ్ కార్డున్న ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని ఏపీఓ దేవరికి సూచించారు. చిందేపల్లె సర్పంచ్ పెంచలయ్య మాట్లాడారు. తొలుత ముసలిపేడు ఎంపీటీసీ సభ్యురాలు తుపాకుల రమణమ్మ మృతికి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ సమస్యలను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య, వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, ఏఈ వాసుదేవయ్య, ఏపీఎం పళణికుమార్, ఆర్‌డబ్ల్యూ ఏఈ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అక్రమ వెంచర్‌పై తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ రాజుకు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాసులు, ఎంపీటీసీ రమణమ్మ మృతికి మౌనం పాటిస్తున్న సభ్యులు

ఎంపీటీసీ సభ్యురాలి మృతి


రమణమ్మ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు తుపాకుల రమణమ్మ(47) సోమవారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

3న పల్స్‌పోలియో విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నాగలాపురం: మార్చి 3న నిర్వహించ తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరూ సమష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని ఎంపీడీఓ పీఎంకె బాబు అన్నారు. పల్స్‌పోలియో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో నిరోధక చుక్కలు వేయాలన్నారు. 3వ తేదీ చుక్కలు వేయని వారికి 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేయాలన్నారు. ఏఎస్ఎంలు, డ్వాక్రా సభ్యులు, అంగన్‌వాడీ,, ఆశా వర్కర్లు సహకారంతో దీనిని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సభ్యురాలు సుమతి, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధు, నాగలాపురం వైద్యాధికారి డాక్టరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రీవాణి ప్రచారం



కాసరంలో ప్రచారం చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి


శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని కాసరం, కొండరాజుపల్లెలో సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండలాధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, నాయకులు ఢిల్లీబాబు, కోవి చంద్రయ్య నాయుడు, మణినాయుడు, శ్రీరాములురెడ్డి, అలంకార్, రంగయ్య, సురేష్‌రెడ్డి, పాపయ్య, మధురెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శంకరయ్య, రాఘవులు, ప్రభాకర్, ప్రసాద్, గిరిరెడ్డి, గంగాధరం, గురుమూర్తి, వేమాలయ్య, గౌస్‌బాషా, భాస్కర్, చంద్రయ్య, నాగరాజు, జగదీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తును మార్చిన జగనన్న పాలన


జింగిలిపాళెంలో ప్రచారం చేస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల భవిష్యత్తు మార్చారని తొట్టంబేడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని శ్రీకాళహస్తి మండలం జింగిలిపాళెం, దళితవాడ, ముళ్లపూడి ఎస్టీకాలనీలో సోమవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి పొందిన వారిని కలిసి మాట్లాడారు. తన తండ్రి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉన్నారన్నారు. నాలుగేళ్లుగా ప్రజలకు ముఖం చాటేసిన వారు ఇప్పుడు ఎన్నికల తరుణంలో ప్రజలను మభ్య పెట్టడానికి వస్తున్నారని, వారికి నిలదీసి బుద్ధి చెప్పాలని పరోక్షంగా టీడీపీ నాయకులను ఉద్దేశించి చెప్పారు. వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భానుయాదవ్, రామచంద్ర యాదవ్, శేఖర్‌యాదవ్, శంకరయ్య, సుబ్రహ్మణ్యం, మునిరాజయాదవ్, మనోహర్, సురేంద్రయాదవ్, దిలీప్, రంగయ్య, చందు, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గురవయ్య, అమర్‌నాథ్ రెడ్డి, గురునాథంరెడ్డి, రవి, మల్లికార్జున్, ప్రకాష్, ప్రసాద్‌నాయుడు, ఈశ్వరయ్య, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి


విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని నెరబైకండ్రిగ గ్రామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవధాన కల్యాణం పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: రచయిత అవధాని కల్యాణ చక్రవర్తి రాసిన అవధాన కల్యాణం పుస్తకాన్ని సోమవారం విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య దామోదరనాయుడు మాట్లాడుతూ తెలుగు పద్యం ఎల్లలు దాటి అనేక దేశాలకు వ్యాపించడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఉపాధ్యాయుడు మాలేపట్టు పురుషోత్తమాచారి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, సాహితీవేత్తలు సముద్రాల విజయానంద్, మన్నవ గంగాధరప్రసాద్, వేమూరి జయరాంప్రసాద్, పరమేశ్వరయ్య, ఆకుల మల్లేశ్వరరావు, ఏనుగుల అంకమ నాయుడు, టింకా యలదామోదరం, కృష్ణస్వామిరాజు, సురేంద్రరొడ్డ, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

సిగ్నేచర్ ట్యూన్ పుస్తకం..

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన సిగ్నేచర్ ట్యూన్ పుస్తకాన్ని సోమవారం వీసీ భారతి ఆవిష్కరించారు. రచయిత మాట్లాడుతూ జర్నలిజంలో తన అనుభవాలతో పాటు వాస్తవాలను పుస్తకంలో పొందుపరిచినట్టు తెలిపారు. బ్రాడ్ కాస్టింగ్‌కు సంబంధించిన మౌలిక విషయాలు, రేడియో మాధ్యమానికి అవసరమైన కీలక అంశాలను సవివరంగా తెలియజేసినట్టు వెల్లడించారు. రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తి పైకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

- వ్యక్తి మృతి


మృతుడు రాఘవయ్య(ఫైల్)

శ్రీకాళహస్తి: రోడ్డుపక్కన చెట్టు కింద నిద్రిస్తున్న వ్యక్తిపై స్కూల్ బస్సు దూసుకెళ్లడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించిన సంఘటన తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రారాజు కథనం .. చిన్నసింగమాల దళితవాడకు చెందిన వ్యవసాయ కూలీ రాఘవయ్య(45) సోమవారం గ్రామంలో ఓ రైతుకు వ్యవసాయ పనులకు వెళ్లాడు. పనులను ముగించుకుని ఎండ ఎక్కువగా ఉండటంతో రోడ్డు పక్కన ఓ చెట్టు నీడన పడుకుని నిద్రలోకి జారుకున్నాడు. అయితే అటువైపు వెళుతున్న శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి అతనిపైకి దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన రాఘవయ్యను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.


ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

హథీరాంజీ మఠం మహంత్‌గా ఓంప్రకాష్ దాస్

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని హథీరాంజీ మఠం మహంత్‌గా తిరుమలలోని జపాలి హనుమాన్ ఆలయంలో పనిచేస్తున్న ఓంప్రకాష్ దాస్ సోమవారం హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ కె.రమేష్ నాయుడు నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రండి



ఎస్పీ మల్లికాగార్గ్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి ఆహ్వానపత్రికలు అందజేస్తున్న చైర్మన్ తారక శ్రీనివాసులు, ఈఓ తదితరులు

- ఎస్పీ, టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి, తిరుపతి జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్‌కు పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు, ఆలయ అధికారులతో కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సుదర్శన్‌రెడ్డి, కామేశ్వరరావు, వేదపండితులు ఆంజనేయశర్మ, త్రినాథ్‌శర్మ, పరిచారకులు రాఖీశర్మ ,పట్టణ ప్రముఖులు కొండూరు నంద, సురేష్, బాల, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దేవులపల్లి అమర్‌కు సాదర స్వాగతం


దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న బాలకొండయ్య

రేణిగుంట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా మూడురోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుపతి శ్రీవారి దర్శనార్థం రోడ్డు మార్గాన వెళ్లారు.

సదుపాయాల కల్పనపై సమీక్ష


మాట్లాడుతున్న తహసీల్దారు పఠాన్ మహ్మద్ అలీఖాన్

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని మండల ఎన్నికల అధికారి, తహసీల్దారు పఠాన్ మహ్మద్ అలీఖాన్ తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లు, అధికారులు సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. గదులకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఓటరు లిస్టులను పరిశీలించి, తప్పులు ఉంటే బీఎల్‌ఓలకు తెలియజేసి సరిచేయాలని సూచించారు.

ముక్కంటి సేవలో రామకృష్ణ పీఠాధిపతులు


ఆలయ ధ్వజస్తంభం వద్ద రామకృష్ణ మఠం పీఠాధిపతులు అమృతానందస్వామి తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం తిరుపతి రామకృష్ణ మఠ పీఠాధిపతులు అమృతానందస్వామి, అనంతరూపానందస్వామి, బర్గేశానందస్వామి తమ శిష్యబృందంతో దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహానంది విగ్రహ ప్రతిష్ట


త్రయంబకేశ్వరాలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన నంది విగ్రహం

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో గల రాజగోపురం ఎదుట స్థానిక విశ్రాంత బ్యాంక్ మేనేజర్ బొప్పన మోహనమురళితో నిర్మించిన మహానంది విగ్రహాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ముందుగా వినాయక పూజతో ప్రారంభించి, ప్రత్యేక హోమపూజలు చేపట్టి విగ్రహ ప్రతిష్ట జరిగింది. అనంతరం నందీశ్వరునికి ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు మహానందిని దర్శించుకుని ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకులు రాజేంద్రప్రసాద్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిర్మల్ కుమార్, మాడస్వామి, రాజు, బొప్పన రమేష్, ఎంపీపీ పద్మప్రియ, వైఎస్ ఎంపీపీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నతంగా స్విమ్స్

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- స్విమ్స్ వైద్యుల సేవలు అభినందనీయం
- వైద్య విద్యార్థులు సమాజ సేవ చేయాలి
- ఘనంగా స్విమ్స్ వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: స్విమ్స్‌ను దేశంలోనే అత్యున్నత వైద్య సంస్థగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. స్విమ్స్ 31వ వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. టీటీడీ చైర్మన్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్విమ్స్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు.ఇదే స్ఫూర్తితో వైద్య విద్యార్థులు సమాజ హితం కోసం సేవలు చేయాలని పిలుపునిచ్చారు. వైద్యులకు సాంకేతిక సహకారం అందించడంతోపాటు స్విమ్స్ అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. స్విమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా అభివృద్ధి చేసే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటుతో స్విమ్స్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా టీటీడీ తీసుకున్నట్టు చెప్పారు. స్విమ్స్ సంచాలకుడు డాక్టర్ ఆర్‌వీ.కుమార్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలలో స్విమ్స్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. మూడు రకాల ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం స్విమ్స్ ఘనతన్నారు. మరో రెండు నెలల్లో శ్రీ బయోను అందుబాటులోకి తెస్తామన్నారు. ఇందుకోసం ఐఐటీ, ఐసర్, ఐఈఎస్ఈఆర్ తిరుపతిలోని అన్ని యూనివర్సిటీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆకాంక్ష సీడీ వార్షిక నివేదిక సీడీలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరిఫీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి, డాక్టర్లు వనజాక్షమ్మ, మధుబాబు, పీవీజీకే.శర్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.